సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం ¦ 28 ¦ జూలై ¦ 2023



ఇళ్లు కూలుతున్నాయ్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పాత ఇళ్లు కూలుతున్నాయి.

వివరాలు 8లో ▸



ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని దీప్లానాయక్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.1 /21.4

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే ముసురు కమ్ముకుంటుంది. అడపాదడపా భారీ వర్షం కురవొచ్చు.

న్యూస్‌రీల్

డ్రోన్ ప్రదర్శన వాయిదా

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నిరంతరాయంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించదలచిన డ్రోన్ ప్రదర్శన వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రదర్శనను వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

నల్సా పథకాలపై అవగాహన కల్పించాలి



పాలమూరు: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదన్ భవన్‌లో నల్సా పథకాల అమలుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ నల్సా పథకాలతో పాటు లీగల్ సర్వీస్ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పుట్టపాగ రఘుపతి, యోగేశ్వర్ రాజ్, రాజేష్, మల్లారెడ్డి, నయిముద్దీన్, అరుణ, రాజన్, రవికుమార్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో నైపుణ్యాభివృద్ధి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేలా ప్రభుత్వం నూతన విద్యావిధానం రూపకల్పన చేయడం గొప్ప విషయం అని హైదరాబాద్, కంచన్‌బాగ్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ వీరేంద్రకుమార్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలో నూతన విద్యావిధానం-2020పై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, యువతలో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేలా మార్పులు చేశారని, ఇందులో భాగంగా అటల్ టింగకరింగ్ ల్యాబ్, విద్యాంజలి, దీక్ష పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. మహబూబ్‌నగర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ దశరథరాం మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం పీఎంశ్రీ స్కీం కింద ఎంపికైందని, ఈ పథకం ద్వారా మొత్తం రూ.2.5 కోట్లు మంజూరవడంతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్రీయ విద్యాలయంలో ఈ సంవత్సరం బాలవాటిక-3 ఎల్‌కేజీ, ప్రారంభించామని, వచ్చే విద్యాసంవత్సరాల్లో బాలవాటిక- 3 యూకేజీ, బాలవాటిక-1 నర్సరీలను ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చైతన్య సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపల్ సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తాం: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎంకు వచ్చిన ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. గద్వాల నుంచి ఆత్మకూర్ మీదుగా మంత్రాలయం వరకు బస్సు నడపాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో నవాబుపేట నుంచి కూచూరు మీదుగా దొడ్డుపల్లి వరకు బస్సులు నడపాలని, భూత్పూర్-జడ్చర్ల వరకు బాదేపల్లి మీదుగా బస్సులు నడపాలని చాలామంది కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ వద్ద ఉన్న మెడికల్ కళాశాల వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, ఉదయం వేళల్లో భూత్పూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడపాలని కోరారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయులకు నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం ప్రారంభించిన తొలిమెట్టులో భాగంగా బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చుకుని, ఈ సంవత్సరం ఎఫ్‌ఎల్‌ఎన్-2 కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బాలుయాదవ్, దుంకుడు శ్రీనివాస్, మన్నన్, అబ్దుల్‌రబ్ పాల్గొన్నారు.

వదలని వర్షం..



అడ్డాకుల మండలం ముత్యాలంపల్లి వద్ద పెద్దవాగుపై అలుగుపారుతున్న చెక్‌డ్యాం

- కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం
- చెరువులు, కుంటల్లోకి భారీగా వరద
- వరినాట్లలో నిమగ్నమైన రైతన్నలు
- నేటికీ కమ్ముకున్న మేఘాల్లోనే పాలమూరు



కుర్వగడ్డపల్లి వద్ద మీనాంబరం వాగు చెక్‌డ్యాం పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షం జిల్లాను వదలడం లేదు. మొదట ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా సుమారు వారం రోజులపాటు వర్షం కురిసింది. ఆ తర్వాత ఒకటి, రెండు రోజులపాటు విరామం ఇచ్చిన వరుణుడికి మరో అల్పపీడనం తోడవడంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జోరు వానలతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. జడ్చర్ల నియోజకవర్గం గుండా పారుతున్న దుందుభీ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. గురువారం జిల్లావ్యాప్తంగా సగటున 39.9 మి.మీ., వర్షపాతం నమోదైంది. అయితే గడిచిన పదిరోజులుగా కమ్ముకున్న కారుమబ్బుల్లోనే పాలమూరు మగ్గుతుండగా.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జనజీవనం స్తంభించింది.

అలుగు పారుతున్న చెరువులు

జిల్లావ్యాప్తంగా 28 చెరువులు అలుగులు పారుతున్నాయి. మరో రెండు, మూడు రోజులపాటు ఇదే విధంగా వర్షాలు కురిస్తే జిల్లాలోని చెరువులన్నీ నిండనున్నాయి. దీంతో అప్రమత్తమైన జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ చెరువులకు గండ్లు పడితే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచిస్తున్నారు.

దెబ్బతిన్న రహదారులు

జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో పలుచోట్ల రోడ్లు కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. గ్రామీణ రోడ్లు బురదమయంగా మారాయి. దాని వల్ల కూడా గ్రామీణ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో సైతం పాత ఇళ్లు, మట్టిమిద్దెలు కొన్ని పాక్షికంగా.. మరికొన్ని పూర్తిగా కూలిపోవడంతో పలువురు ప్రజలు నిరాశ్రయులయ్యారు.

అప్రమత్తంగా ఉండండి

జడ్చర్ల టౌన్: దుందుభీ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్పీ కె.నరసింహతో కలిసి మండలంలోని కోడ్గల్ వద్ద దుందుభీ వాగును పరిశీలించారు. 24 గంటలు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతోపాటు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఆయన కుర్వగడ్డపల్లి వద్ద ఉన్న మీనాంబరం వాగు చెక్‌డ్యాంను పరిశీలించారు. ప్రమాదాలు జగరకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు, సందర్శకులను వాగు ఉధృతి తగ్గే వరకు పరిసరాల్లోకి రానివ్వొద్దని హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సీఐ రమేష్‌బాబు, ఎంపీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం ఇలా.. (మి.మీ.)

దేవరకద్ర	58.0
అడ్డాకుల	56.6
మూసాపేట	53.1
మహబూబ్‌నగర్ రూరల్	49.8
చిన్నచింతకుంట	46.1
కౌకుంట్ల	45.9
మహబూబ్‌నగర్ అర్బన్	39.8
భూత్పూర్	39.7
హన్వాడ	38.4
జడ్చర్ల	36.6
నవాబుపేట	36.2
గండేడ్	36.1
బాలానగర్	35.7
రాజాపూర్	34.8
కోయిలకొండ	32.4
మిడ్జిల్	32.2
మహమ్మదాబాద్	6.2

జోరందుకున్న వరినాట్లు...

జిల్లాలో భారీ వర్షాలు పడుతుండటంతో వరి సాగు జోరందుకుంది. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే అదను దాటుతుండటం.. నారుమడి సైతం పెరిగి ఉండటంతో ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటం వల్ల ఈ నాట్లను వేస్తున్నారు. కొన్ని గ్రామాల పరిధిలో అవసరానికి కూలీ ఎక్కువగా ఇచ్చి కూడా నాట్లు కొనసాగిస్తున్నారు. వర్షాలు పడే సమయంలో నాట్లు వేస్తే వరి మంచిగా వచ్చే అవకాశం ఉండటంతో ఎక్కువ మొత్తంలో వరి విస్తీర్ణం కొనసాగుతుంది. ఈనెలాఖరులోగా భారీగా వరి సాగు పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అత్యవసర సాయం కోసం కంట్రోల్ రూం నంబర్ 08542-241165

వాగులు దాటొద్దు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం ఆయన భారీ వర్షాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావద్దని, ముఖ్యంగా గ్రామాల్లోని రైతులు, కూలీలు, ఇతరులు వాగులు, వంకలు దాటే సాహసం చేయొవద్దని కోరారు. కాజ్‌వేలు, వాగులు పొంగి ప్రవహించే చోట తక్షణమే రాకపోకలను ఆపేయాలని, అక్కడ సిబ్బందిని రక్షణగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

పెద్దవాగుకు పోటెత్తిన వరద



వర్నె వద్ద వృద్ధుడిని వాగు దాటిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు వరద పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద పెరగడంతో పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు అలుగులు పారుతున్నాయి. అలాగే మూసాపేట మండలంలోని ఇదే వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం నిండుగా ప్రవహిస్తున్నాయి. నిజాలాపూర్, సంకలమద్ది, గౌరిదేవిపల్లి, పొన్నకల్, పేరూరు, ముత్యాలంపల్లి, బలీదుపల్లి గ్రామాల శివారులోని చెక్‌డ్యాంలు అలుగు పారుతున్నాయి. సంకలమద్ది శివారులోని వాగు నుంచి కొమిరెడ్డిపల్లి మీదుగా కాల్వ ద్వారా పొన్నకల్ చెరువుకు వరద నీళ్లు ప్రవహిస్తున్నాయి. పెద్దవాగులో వరద పెరగడంతో వర్నె వద్ద వాగులో మట్టిదారి తెగిపోయి అడ్డాకుల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అడ్డాకులకు కొత్తకోట మండలంలోని కనిమెట్ట మీదుగా రావాల్సి వస్తోంది. చివరి దశలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయితేవర్నె, ముత్యాలంపల్లి గ్రామాల ప్రజలకు దారి కష్టాలు తీరనున్నాయి.



చిన్నచింతకుంట- మద్దూరు గ్రామాల మధ్యన తెగిన చెరువు కాల్వ

చెరువులు, చెక్‌డ్యాంలకు జలకళ

చిన్నచింతకుంట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. గురువారం చిన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో చిన్నచింతకుంట, ఏదులాపురం సమీపంలో ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు, చెరువులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. చిన్నచింతకుంట చెరువు అలుగుపారి మద్దూరు చెరువుకు నీరు చేరుతుండటంతో ఆ గ్రామాల మధ్యన ఉంద్యాలకు వెళ్లే దారి సమీపంలో చెరువు కాల్వ తెగింది. మరోదిక్కు మద్దూరు బల్జోనికుంట సైతం తెగిపోయి నీరు వృథాగా పారుతుంది.

జలసత్వాలు



జూరాల క్రస్టుగేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- కృష్ణాబేసిన్‌లో కురుస్తున్న భారీ వర్షాలు
- జూరాలకు పెరుగుతున్న వరద.. 7 గేట్ల ఎత్తివేత
- నెట్టెంపాడు, భీమాకు మొదలైన పంపింగ్.. త్వరలోనే కేఎల్‌ఐ, కోయిల్‌సాగర్‌కు సైతం
- తుంగభద్ర బేసిన్‌లోని ఆర్డీఎస్‌కూ ఆశాజనకమే
- నదీతీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన యంత్రాంగం

గద్వాల రూరల్: వానాకాలం మొదలై నెలరోజులు గడిచినా.. వాన జాడ లేకపోవడంతో కృష్ణా బేసిన్ పరిధిలోని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు అడుగంటి ఒకింత ఆందోళన కలిగించింది. ఇదంతా పది రోజుల కిందటి మాట.. కానీ, గడిచిన పది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనంతో పాటు ప్రాజెక్టులు, భూములు తడిసి ముద్దవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా.. మహారాష్ట్ర, కర్ణాటకలోని కృష్ణాబేసిన్ పరిధిలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో వరద ప్రవాహం మొదలై.. జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. రాష్ట్రంలోనే కృష్ణాబేసిన్‌లో తొలి ప్రాజెక్టు అయిన జూరాలకు వరద వస్తుండటంతో ఈ సీజన్‌లో మొదటిసారి ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి నీటిని వదిలారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల కింద నీటి పంపింగ్‌ను మొదలుపెట్టారు. మరో మూడు నాలుగు రోజుల్లో కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పంపింగ్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

భారీగా వరద..

కృష్ణాబేసిన్ పరిధిలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సాగు, తాగునీటితోపాటు విద్యుత్తు త్పత్తిని అందించే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సైతం మరో నాలుగైదు రోజుల్లో వరద చేరనుంది. మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద చేరుతుంది. దీంతో ఆల్మట్టి నుంచి 1,75,000 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నారాయణపూర్‌కు విడుదల చేశారు. 48 గంటల తర్వాత జూరాలకు వరద వచ్చి చేరనుందని అధికారులు చెప్పారు. అలాగే తుంగభద్ర బేసిన్ భారీగా వర్షాలు కురుస్తుండడంతో నడిగడ్డలోని 87 వేల ఎకరాల ఆయకట్టున్న ఆర్డీఎస్ పరిధిలో కూడా ఆశాజనకంగా మారింది.

డెడ్ స్టోరేజీకి చేరి..


కృష్ణాబేసిన్ పరిధిలో వర్షాలు కురవకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీరు చేరకపోవడం గడిచిన పదేళ్లలో ఇదే మొదటిసారి. దీంతో జూరాలలో నీటి నిల్వ డెడ్‌స్టోరేజీకి చేరి కేవలం 2.297 టీఎంసీలే మిగిలింది. ఈ క్రమంలో మొన్నటి వరకు జలాశయం పైభాగాన కురిసిన తేలికపాటి వర్షాల కారణంగా 0.41టీఎంసీల వరద మాత్రమే అంటే అర టీఎంసీ కంటే తక్కువ నీరు ప్రాజెక్టుకు చేరింది.

పదిరోజుల్లోనే మార్పు..

పదిరోజుల్లోనే పరిస్థితిలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. కృష్ణాబేసిన్ పరిధిలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు మొదలైంది. గురువారం సుమారు 40 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రాజెక్టులోని ఏడు గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి వదిలారు. మరోవైపు నది పరివాహకంలో వరద పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ఎత్తిపోతలకు జలకళ..

కృష్ణాబేసిన్ పరిధిలో జూరాల ప్రాజెక్టుపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతలను నిర్మించారు. ఈ ప్రాజెక్టుల కింద ఏటా ఖరీఫ్‌లో 7 లక్షల ఎకరాల వరకు ఆయకట్టుకు నీరందిస్తున్నారు. ముఖ్యంగా కల్వకుర్తి ఎత్తిపోతలు శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం ఉన్నప్పుడు బ్యాక్‌వాటర్ నుంచే నీటిని ఎత్తిపోసి దాని కింద 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అలాగే జూరాల ప్రాజెక్టు కింద కుడి ప్రధాన కాల్వ పరిధిలోని జోగుళాంబ గద్వాల జిల్లా, ఎడమ ప్రధాన కాల్వ పరిధిలో మక్తల్, వనపర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అదేవిధంగా భీమా ఎత్తిపోతల పరిధిలో 1.50 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు ఎత్తిపోతల కింద 1.20 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఇలా ఖరీఫ్ సీజన్‌లో 7.05 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుండగా ఈ ప్రాజెక్టుల కింద జూలై, ఆగస్టు నెలల్లో పంటల సాగు పూర్తవుతుంది. ప్రస్తుతం జూరాలకు భారీగా వరద వస్తుండటంతో ఇప్పటికే నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల కింద పంపింగ్, హైడల్ ప్రాజెక్టులో విద్యుత్తుత్పత్తి మొదలుపెట్టారు. మరో మూడు, నాలుగు రోజుల్లో కోయిల్‌సాగర్, కల్వకుర్తికి పంపింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తుంగభద్ర బేసిన్ పరిధిలో సైతం భారీ వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతల (ఆర్డీఎస్) కింద ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.



రామన్‌పాడులో ఒక గేటు ఎత్తి..

మదనాపురం: రామన్‌పాడు జలాశయానికి వరద పోటెత్తింది. గురువారం ఊకచెట్టు వాగు నుంచి వరద కొనసాగుతుండటంతో జలాశయం నిండుకుండలా మారింది. దీంతో అధికారులు ఒక గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1,021 అడుగుల నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వ నుంచి 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. రామన్‌పాడు కుడి కాల్వకు 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎన్టీఆర్ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. తిరుమలాయపల్లి సమీపంలో ఉన్న రెండో దశ భీమా ఎత్తిపోతల ఒకటో స్టేజీ నుంచి 854 క్యూసెక్కుల నీటిని రెండో స్టేజీకి తరలిస్తున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

కేఎస్పీలో 23 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో గురువారం సాయంత్రం 23 అడుగుల నీటిమట్టం ఉంది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దవాగు నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం ఎత్తిపోతల నుంచి నీటి పంపింగ్ నిలిపివేశారు. మరో 9.6 అడుగుల నీరు వస్తే గేట్లు ఎత్తి నీటిని వదిలే అవకాశం ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం..

దోమలపెంట (అచ్చంపేట): కృష్ణా బేసిన్‌లో వరద కొనసాగుతుండటంతో గురువారం జూరాల గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 27,846 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 42,576 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 1,125 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో జలాశయంలో 817.7 అడుగుల నీటిమట్టం, 39.2025 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

కులవృత్తులే నాగరికతకు పునాది

- రూ.లక్ష ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి



బీసీ లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కుల అందజేత తర్వాత సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వ్యవసాయం, అనుబంధ కులవృత్తులే నాగరికతకు పునాది అని, వాటి ద్వారానే గ్రామాలు ఏర్పడ్డాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాలమూరు నియోజకవర్గంలోని వెనకబడిన తరగతుల్లోని పేదలకు ఇచ్చే రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కులవృత్తులపై ఆధారపడి జీవించే వారు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దళితులకు దళితబంధు, గిరిజనులకు, మైనార్టీలకు ఆర్థిక సహాయం అందించిన విధంగానే వెనకబడిన కులాల్లోని పేదలకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో నిష్పక్షపాతంగా ఉంటామని, ఎవరైనా పేదల నుంచి లబ్ధి కోసం డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే తక్షణమే వారిపై పోలీస్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్ష సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేసి ఇంకా ఆర్థికంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 15,787 దరఖాస్తులు రాగా.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సుమారు 14 వేల దరఖాస్తులను అర్హతగా గుర్తించి ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, ఎస్పీ కె.నరసింహ, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, మహబూబ్‌నగర్, హన్వాడ ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


చంద్రమ్మ(ఫైల్)

అడ్డాకుల: ఇంటి వద్ద ఒంటిరిగా ఉన్న వికలాంగురాలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని కందూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వికలాంగురాలు జిల్లి చంద్రమ్మ(56) మట్టిమిద్దెలో ఒంటరిగా నివాసముంటోంది. ఇంటి పక్కనే మరుగుదొడ్డి ఉంది. గురువారం ఉదయం ఇంట్లో నుంచి మరుగుదొడ్డికి వెళ్తుండగా కాలు జారి కిందపడింది. బాత్‌రూంలోకి ఏర్పాటు చేసిన కరెంటు తీగకు తగలడంతో అది తెగి ఇనుప మంచంపై పడింది. అదే సమయంలో ఆమె కూడా ఇనుపమంచంపై పడడంతో విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత స్థానికులు గుర్తించినా ఫలితంలేకుండా పోయింది. సర్పంచ్ శ్రీకాంత్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్త్‌వైర్ తగిలి వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బోయపల్లికి చెందిన కాడం హన్మంతు(37) గురువారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుంటే బోయపల్లి శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ కాలికి తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి శాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

అడ్డాకుల: భార్య చనిపోయింది, కూతుళ్లు పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిపోయారు. ఇంట్లో ఒంటరవడంతో బెంగతో ఇల్లు వదిలిపోయి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలోని కందూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. కందూరుకు చెందిన చిలుక జంగం లాలు(57)కు ఐదుగురు కుమార్తెలు. 15 ఏళ్ల క్రితమే లాలు భార్య చనిపోయింది. దీంతో కూలీపనులు చేస్తూ కూతుళ్లను పోషించాడు. ఒక కూతురు చనిపోగా, ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. చివరి కూతురుతో ఉండగా, ఆమె ప్రేమించి పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. దీంతో లాలు ఇంట్లో ఒంటరివాడయ్యాడు. ఒంటరితనం భరించలేక బెంగతో ఇల్లు విడిచివెళ్లిపోయాడు. గురువారం ఉదయం శాఖాపూర్ శివారులో జాతీయ రహదారిపక్కన చిన్న కాలువలో మృతదేహం స్థానికులకు కనిపించింది. మృతదేహం లాలుదిగా గుర్తించి కందూరు గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ విషయం పోలీసులకు తెలుపగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని అల్లుడు అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో..

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ కథనం ప్రకారం.. భూత్పూరు మండలం అన్నసాగర్‌కు చెందిన యాదయ్య (35) అత్తగారి ఊరైన నెల్లికొండలో మేస్త్రీ పని చేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. నాగర్‌కర్నూల్ హౌసింగ్ బోర్డు కాలనీలోని వెల్డింగ్ షాపులో టైల్స్ వేసేందుకు వెళ్లాడు. గురువారం షాపు వెనకభాగంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్‌ఆస్పత్రికి తరలించారు. యాదయ్యకు అప్పుడప్పుడు మూర్ఛ వస్తుంటుందని అతని భార్య మమత పోలీసులకు తెలిపింది. మూర్ఛ రావడంతోనే మృతి చెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీయూ పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో జరగనున్న అన్ని పరీక్షలను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కొత్త పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు భారీ స్థాయిలో వరద చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. గురువారం 12 యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 13.218 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. 41.633 క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని తెలిపారు.

ఇళ్లు.. కూలుతున్నాయ్!

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని శిథిల ఇళ్లు కూలుతున్నాయి. అధికారులు ముందస్తు చర్యలు చేపడుతూ వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తూ అన్నివిధాలుగా ఆదుకుంటున్నారు. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి చాలా ఇళ్లు కూలిపోయాయి.


వెన్నాచేడ్‌లో కూలిన మట్టి మిద్దె


కారుకొండలో..

మహబూబ్‌నగర్ జిల్లాలో..

■ నవాబ్‌పేట మండలం కారుకొండలో కేశిరెడ్డి రాజు కుటుంబంతో కలిసి బుధవారం రాత్రి ఇంటి మొదటి అంతస్తులో నిద్రించారు. గురువారం తెల్లవారుజామున గోడ కూలిన శబ్దం రాగా.. భార్యా, ఇద్దరు పిల్లలను నిద్రలేపి బయటకు వచ్చారు. కొద్దిక్షణాల వ్యవధిలోనే ఇల్లు మొత్తం కుప్పకూలింది. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా మృత్యువాత పడేవారమని తలుచుకుంటేనే భయంగా ఉందంటూ కుటుంబం రోధించింది. తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, ఎస్ఐ పురుషోత్తం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

■ జడ్చర్ల నల్లకుంటకాలనీలో బుధవారం రాత్రి సుంకసారి లక్ష్మమ్మ ఇల్లు కూలిపోయింది. కొద్ది దూరంలో ఉన్న కుమారుడి ఇంటికి వెళ్లిన సమయంలో ఇల్లు కూలడంతో ప్రాణాపాయం తప్పిపోయింది. గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

■ గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో ఒకటి, రంగారెడ్డిపల్లిలో 3, గండేడ్‌లో 2, అంచన్‌పలిలో ఒక ఇల్లు కూలాయి. ఎలాంటి ప్రాణనష్టం జరలేదు. ప్రత్యేకాధికారి సాయిప్రసాద్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి రంగారెడ్డిపల్లి, గండేడ్‌లో పర్యటించారు.

■ బాలానగర్ మండలం గంగధారిపల్లిలో కుమ్మరి అమృత, కావలి లింగమ్మ, వహీదాబేగంల ఇళ్లు కూలగా, పెద్దరేవల్లిలో కొమ్ము అమృత ఇలు కూలింది. కూలిన ఇళ్లను మండల ప్రత్యేక అధికారి బాబురావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణారావు, ఎస్ఐ శ్రీనివాస్ పరిశీలించారు.

■ మిడ్జిల్ మండలం వస్పులలో అసెగండ్ల శ్రీను ఇల్లు గురువారం కూలింది. కూలీన ఇంటిని తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, సీఐ జములప్ప, ఎస్ఐ రాంలాల్ నాయక్ పరిశీలించారు.

■ చిన్నచింతకుంట మండలం అల్లీపురం, ఏదులాపురం, దమగ్నాపురంలో 13 ఇళ్లు పాక్షికంగా కూలాయి. తహసీల్దార్ సువర్ణరాజు, ఎస్ఐ ఆర్.శేఖర్ గురువారం పరిశీలించారు. శిథిల ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

■ హన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో 13 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..


కోడేరు మండలం బాడిగదిన్నెలో కూలిన ఇంటి వద్ద బాధితులు

■ తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లిలో వెంకటయ్య, నాగమ్మ, భేగంకు చెందిన మూడు మట్టి ఇళ్ల పైకప్పు పడిపోయాయి. సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి గురువారం పరిశీలించి బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

■ కోడేరు మండలం బాడిగదిన్నెలో మూడు, రాజాపూర్‌లో ఒకటి, తుర్కదిన్నెలో ఒకటి, జనుంపల్లిలో ఒక ఇల్లు కూలాయి.

■ వెల్దండ మండలం సల్లపల్లిలో పకాడి రాములమ్మ ఇంటి పైకప్పు గురువారం పడిపోయింది. ప్రమాద సమయంలో రాములమ్మ పక్క ఇంట్లో పడుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నారాయణపేట జిల్లాలో..

■ ధన్వాడలో చాకలి రాములు మట్టి ఇల్లు గురువారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మంత్రోనిపల్లిలో ఉపసర్పంచ్ చెన్నయ్య ఇల్లు కూలిపోయింది.

■ ఊట్కూర్ మండలంలోని పులిమామిడిలో 6, కొత్తపల్లిలో 1, చిన్నపార్లలో 1, ఊట్కూర్ 2 మట్టి ఇళ్లు వర్షాలకు పడిపోయాయి.


కూలిన చాకలి రాములు ఇల్లు


కొండాపురంలో..

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

అయిజ మండలంలో గురువారం ఒక్కరోజే 8 ఇళ్లు కూలిపోయాయి. మండల కేంద్రంలో 2, బింగుదొడ్డిలో 1, ఉత్తనూరులో 3, ఎక్లాస్‌పురంలో 2 ఇళ్లు కూలినట్లు అధికారులు తెలిపారు.

■ రాజోళిలో 1, నసనూర్‌లో 1, మాన్‌దొడ్డిలో 2 ఇళ్లు కూలిపోయాయి. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు.

■ కేటీదొడ్డి మండలం కొండాపురం, కేటీదొడ్డికి చెందిన లోటప్ప, చాకలి రవి, రాజు, తిమ్మప్ప ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆర్ఐ ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మునినాయక్, సర్పంచ్ జయమ్మ, మహానందిరెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు.

వనపర్తి జిల్లాలో..

పెబ్బేరు పురపరిధిలోని చెలిమిళ్లలో గురువారం సురగని శ్రీనివాస్‌గౌడ్ ఇంటిగోడ కూలింది. కౌన్సిలర్ రామకృష్ణనాయుడు, వార్డు ప్రత్యేక అధికారి శంకరయ్య పరిశీలించారు.

■ ఆత్మకూర్ మండలం రేచింతలలో 3, పిన్నంచర్లలో 1, ఆత్మకూర్‌లో 3, కత్తేపల్లిలో 1, తిప్పడంపల్లిలో 2, బాలకిష్టాపూర్‌లో 2 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ సింధూజ తెలిపారు. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయని వివరించారు.

■ మదనాపురం మండలంలోని దుప్పల్లిలో సాకలి బాల్‌రాం, రామన్‌పాడులో నారాయణగౌడ్, గోవిందహళ్లిలో వెంకటయ్య ఇల్లు కూలిపోయాయి. గురువారం తహసీల్దార్ నరేందర్ సిబ్బందితో కలిసి ఇళ్లను పరిశీలించారు.


ఆత్మకూర్‌లో కూలిన ఇల్లు

విషాదం నింపిన విహార యాత్ర

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
● మృతులు ఏపీలోని పల్నాడు జిల్లావాసులుగా గుర్తింపు


ఘటనా స్థలంలో కారు, లారీ


షేక్ బాషా (ఫైల్)


షేక్ షుకూర్ (ఫైల్)

మక్తల్: విహారయాత్రకు వెళ్లి సరదాగా గడిపిన ముగ్గురు స్నేహితులు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మార్గమధ్యలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. వాహనాన్ని అతివేగంగా నడపడం వల్ల ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన షేక్ షుకూర్(55), షేక్ బాషా(58), పాకాలపాడుకు చెందిన అంజయ్య కలిసి డ్రైవర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ఈ నెల 22న సత్తెనపల్లి నుంచి కారులో గోవాకు విహారయాత్రకు వెళ్లారు. గోవా నుంచి బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మక్తల్ మండలం గుడిగండ్ల శివారులో మక్తల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని వెనక నుంచి వేగంగా ఢీకొట్టడంతో కారు చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో షుకూర్, షేక్‌బాషా అక్కడికక్కడే మృతిచెందారు. కారులో మృతదేహాలు ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని బయటకు తీశారు. కాళ్లు, చెయ్యి విరిగి తీవ్రగాయాలపాలైన అంజయ్యను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మహబూబ్‌నగర్‌కు తరలించారు. డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు.

కేసు నమోదు..

షుకూర్‌కు ఓ సినిమా థియేటర్ ఉండగా.. షేక్ బాషాకు బేకరి ఉంది. వీరంతా ప్రతి సంవత్సరం గోవాకు వెళ్లి వచ్చేవారు. అయితే ఈసారి మాత్రం రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. షుకూర్‌కు భార్య షేక్ ఆరిఫ్, కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. షేక్‌బాషాకు భార్య రఫియా సుల్తానా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సత్తెనపల్లి నుంచి మక్తల్‌కు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

పల్లె దవాఖానా సందర్శించిన కేంద్ర బృందం


రుద్రారం పల్లె దవాఖానలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నవాబుపేట: మండలంలోని రుద్రారంలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానను కేంద్ర బృందం గురువారం సందర్శించింది. సభ్యులు డాక్టర్ నరేష్ గోయల్, డాక్టర్ రాజ్యలక్ష్మిమిశ్రాల బృందం ఆస్పత్రిలో వివరాలు సేకరించారు. పల్లె స్థాయిలో ప్రజలకు కావాల్సిన సదుపాయలు, మందులు, అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది విషయంపై ఆరా తీశారు. కేంద్రం ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కాగా స్థానిక సిబ్బంది పర్యవేక్షణతో మరింత ప్రయోజనం చేకూరుతుందని వారు వివరించారు. ఫలితాల ఆధారంగా మరిన్ని దవాఖానలు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. వారి వెంట రుద్రారం సర్పంచ్ లలితమ్మ, వైద్యాధికారుల బృందం నవీన్‌చంద్ర, శ్రీజా, శరభలింగం, అవినాష్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

30న ముస్లిం డిక్లరేషన్ సభ


సమావేశంలో మాట్లాడుతున్న ఫారుఖ్‌హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రంలో 14శాతం ఉన్న ముస్లింలకు ఇచ్చిన హామీలు, వాటి పురోగతిపై 22 అంశాలతో కూడిన ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభను ఈనెల 30న జిల్లా కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం వివిధ ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ల కల్పన, నిరుద్యోగ యువతకు బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు ఇవ్వడం, వక్ఫ్ స్థలాల పరిరక్షణ, ఉర్దూ మీడియం కళాశాలలు, పాఠశాలలు, ఉర్దూ భాషా అభివృద్ధికి తీసుకున్న చర్యలు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ముస్లింలకు ఏ మాత్రం ఉపయోగంలో ఉన్నాయా అనే అంశాలపై సమావేశంలో చర్చి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహ్మద్ సలీం, కోకన్వీనర్ సైకిబాబా, ప్రొఫెసర్ అన్సారీ, ప్రముఖ సామాజికవేత్త ఖాలిదా పర్వీన్, కోఆర్డినేటర్ మహ్మద్ యూసుఫ్ పర్వేజ్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, కార్యకర్తలు, ముస్లిం ఉలేమాలు, ఇమామ్, మౌజన్లు, మదర్సా నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎం.ఖలీల్, ఆల్‌మేవా జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.ఇష్రత్‌అలీ, మహ్మద్ అయాబ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖయ్యూం, సిరాజ్‌ఖాన్, ముఖ్తార్, ఆమేర్ సోహైల్, మిర్జా షోయబ్ బేగ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మాలలకు అన్యాయం


మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన మాల కులానికి చెందిన నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన దళితబంధు, ఇతర సంక్షేమ పథకాల్లో సమ ప్రాధాన్యం ఇవ్వకుండా మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వివక్షను ఎదుర్కొనేందుకు మాలలంతా ఏకమై సంఘటిత శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో జిల్లా అధ్యక్షుడు గండీటి చిన్న అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం సాధించాలంటే మాలలు అన్ని కులాలతో సఖ్యతగా ఉండాలని సూచించారు. మాలలను చిన్నచూపు చూస్తున్న ఈ పార్టీలను, నాయకులను తరిమికొట్టడానికి మాల మహానాడు గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి సీఎం, మాలలపై అన్నివిధాలుగా వివక్ష చూపుతున్నారని అన్నారు. మాలలను చిన్నచూపు చూసే పార్టీలకు, ఎమ్మెల్యేలకు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బి.రమేష్, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి అరేందర్, నాయకులు ఆంజనేయులు, రవికుమార్, సత్తయ్య, ఆనంద్, భరత్ పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ సభ వాయిదా

కొల్లాపూర్: ఈనెల 30వ తేదీన కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన పాలమూరు ప్రజాభేరి సభ వాయిదా వేసినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి పేర్కొన్నారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లో మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రంగినేని అభిలాష్‌రావు, వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. సభా ప్రాంగణాన్ని పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించిందని, ఆ ప్రాంతం బురదమయంగా ఉండడంతో వాయిదా నిర్ణయాన్ని పార్టీ తీసుకుందని, ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. కొల్లాపూర్ అసెంబ్లీ టికెట్ కేటాయింపులపై ఎవరికి వారే ప్రకటనలు చేసుకోవద్దని, సర్వే ప్రకారమే టికెట్ల కేటాయింపులు ఉంటాయని అన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు ఉన్నారు.



ప్రభుత్వం మొండివైఖరి వీడాలి


కలెక్టరేట్ గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పంచాయతీ కార్మికులు 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా మొండివైఖరి అవలంభిస్తుందని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అరుణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు గురువారం పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. క్రిష్టియన్‌పల్లి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. అయితే కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద కార్మికులు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్సీ జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని, ప్రస్తుత జనాభ ప్రకారం కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. నాయకులు దేవదానం, వెంకట్రాములు, కృష్ణయ్య, సురేష్, మైబు, ఆంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

వెల్దంద: మండలంలో గురువారం మహిళపై కోతులు దాడిచేసి గాయపరిచాయి. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం దొడ్లపహాడు గ్రామానికి చెందిన జంగమ్మ మండల కేంద్రంలోని మట్ట లక్ష్మమ్మ ఇంటికి గురువారం వచ్చింది. ఇంటి ఆవరణలో జంగమ్మ ఉండగా ఒక్కసారిగా కోతుల గుంపువచ్చి దాడి చేశాయి. స్థానికులు కోతులను చెదరకొట్టి ఆస్పత్రికి తరలించారు. కల్వకుర్తి ఆస్పత్రిలో చికిత్స అందించామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

భారత జట్లకు అధికారిగా పీయూ వీసీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ -2023లో పాల్గొనే భారత జట్లకు అధికారిగా పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌ను అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ద్వారా ఎంపికైనట్లు ఆయన గురువారం ప్రకటనలో తెలిపారు. చైనాలోని చెంగ్డు నగరంలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌కి వివిధ విభాగాల నుంచి మొత్తం 326 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈయన వీరికి అధికారిగా వ్యవహరించనున్నారు. 2019లో ఇటలీలోని నెపోలీ పట్టణంలో నిర్వహించిన వర్డల్ యూనివర్సిటీ గేమ్స్‌కు కూడా ఈయన మేనేజర్‌గా ఎంపికైనట్లు పేర్కొన్నారు.

31న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

మహబూబ్‌నగర్‌క్రైం: ఈనెల 31న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న పట్టణంలోని న్యూటౌన్ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ముఖ్య నేతలు, మండల స్థాయి నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, నేతలు కట్టా సుధాకర్, నాగురావు నామాజీ, పి చంద్రశేఖర్, వీరేందర్‌గౌడ్, పడకుల బాలరాజు, ఎగ్గని నర్సింహులు, ఎన్‌పీ వెంకటేష్, పద్మజారెడ్డి పాల్గొన్నారు.